క్లుప్తంగా

ఆకస్మిక తనిఖీ



ఫిర్యాదు పరిశీలిస్తున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు

రేగిడి: మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే జగనన్న గోరుముద్ద కార్యక్రమంపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలోని కంప్లెయింట్ బాక్సు పరిశీలించి, సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో హెచ్ఎం వారణాశి ప్రవీణ్‌కుమార్, సుమలత, ఎంఐఎస్ఎమ్ కో ఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నతి'పై దర్యాప్తు



కొప్పరవలసలో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ సింహాచలం, వెలుగు శాఖ అధికారులు

వంగర: వెలుగు శాఖ ద్వారా మహిళా సంఘ సభ్యులకు మంజూరు చేసిన ఉన్నతి పథకం రుణాలపై శ్రీకాకుళం విజిలెన్స్ విభాగం సీఐ సింహాచలం దర్యాప్తు నిర్వహించారు. మండల పరిధిలోని మద్దివలస, బంగారువలస, కె.కొత్తవలస, కొండచాకరాపల్లి గ్రామ సంఘాల పరిధిలో మంజూరు చేసిన రుణాలపై సోమవారం తనిఖీలు చేపట్టారు. సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లింపులను పరిశీలించారు. అలాగే రికార్డులు తనిఖీ చేసి రుణాలు తీసుకున్న మహిళలతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏపీఎం మీసాల చక్రపాణి, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సీసీ సింహాచలం, వీఓఏలు చిన్నయ్య, అరంజ్యోతి, సుశీల, మౌళి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు పాగిరి విద్యార్థులు



జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాజాం: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి యోగా పోటీల్లో పాగిరి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాలకు చెందిన వెంకటేష్, రోహిత్, ప్రభాష్ అబ్బాయిల విభాగంలో.. ద్రాక్షాయిని, అపర్ణ అమ్మాయిల విభాగంలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్. సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పీడీ అజయ్‌కుమార్, యోగా శిక్షకుడు ఎల్. దుర్గాప్రసాద్‌తో కలిసి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

కౌలు రైతులకు రుణాలు



ఎస్‌బీఐ బీఎంతో మాట్లాడుతున్న ఏఓ కన్నబాబు

వంగర: గ్రామాల్లోని కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్‌కు కౌలు రైతుల జాబితాలు అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలో 301 మంది రైతులకు కౌలు రైతుల గుర్తింపు కార్డులు అందించామన్నారు. వారిలో అర్హత గల రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



స్పందనలో మాట్లాడుతున్న లోపింటి త్రినాథ్

వంగర: ప్రజలు తెలియజేస్తున్న సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఏఓ లోపింటి త్రినాథులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గొబ్బూరు విజయ్‌కుమార్, ఎంఈఓ వై.దుర్గారావు, ఏపీఎం మీసాల చక్రపాణి , తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



తెర్లాంలో బీపీ తనిఖీలు చేస్తున్న ఏఎన్ఎంలు ప్రశాంతి, ప్రభావతి

రామభద్రపురం: ప్రజారోగ్య సంరక్షణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఈ నెల 30వ తేదీ నుంచి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. స్థానిక ఎంపీపీ క్యాంపు కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్, వైద్యారోగ్య సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆయన ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలను కలిసి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. అనంతరం కార్యక్రమ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 30న రామభద్రపురం -1, అక్టోబరు 3న బూసాయవలస, 4న రామభద్రపురం-3, 5న దుప్పలపూడి, 6న కొట్టక్కి,7న సోంపురం, 9న తారాపురం, 10న నాయుడువలస, 11న గొల్లపేట, 12న పాతరేగ, 13న జన్నివలస, 16న కొండకెంగువ, 17న రొంపల్లి, 18న రావివలస, 19 కోటశిర్లాం సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

30న వైద్య శిబిరం..

బాడంగి: మండలంలో ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, శిబిరాలకు రోగులు వచ్చేలా అధికారులు చూడాలని వాడాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదిత్య కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన శివారు గ్రామాల నుంచి వైద్య శిబిరాలకు హాజరయ్యే వారికి అలవెన్స్‌లు కూడా ఇస్తామన్నారు. ఈ నెల 30న తొలుత బాడంగి-2 సచివాలయ పరిధిలోని పిన్నవలసలో వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, ఎంఈవో-2 రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. సోమవారం ఆయా పీహెచ్‌సీల సీహెచ్‌వోలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు గ్రామాల్లోని ప్రతీ ఇంటికీ వెళ్లి, కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం వివరించి, అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించారు. తెర్లాం పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'

- స్పందన కార్యక్రమంలో ఎంపీడీవో శంబంగి రామకృష్ణ



తెర్లాం: వినతిపత్రం అందుకుంటున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరైన ఆయన మండలంలోని విజయరాంపురం, నెమలాం గ్రామస్తులు సమర్పించిన పలు వినతి పత్రాలను పరిశీలించారు. నెమలాంలోని పశువైద్య కేంద్రం ద్వారా తమ పశువులకు సరిపోయినన్ని మందులు సరఫరా కావడం లేదని గ్రామస్తులు, తమ రేషన్‌కార్డు నుంచి తమ తల్లి(మృతురాలు) పేరును తొలగింపజేసి, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని విజయరాంపురం గ్రామానికి చెందిన జరజాన సూర్యనారాయణ, ఇళ్లస్థలం మంజూరు చేయాలని బోనంగి శారద కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

ప్రతిరోజూ లాగిన్ ఓపెన్ చేయాలి..

రామభద్రపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో రమామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె కార్యక్రమానికి హాజరైన మండల, గ్రామ స్థాయి అధికారులతో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం ఫిర్యాదుల లాగిన్‌ను ప్రతిరోజూ ఓపెన్ చేసి, వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. మీ వద్దకు వచ్చిన వినతిపత్రం సమస్య మీదికాకపోతే సంబంధిత శాఖకు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్సను కలిసిన న్యాయవాదుల బృందం



మంత్రి బొత్స సత్యనారాయణతో బొబ్బిలి న్యాయవాదులు

బొబ్బిలి: అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, హైకోర్టు న్యాయమూర్తి దుర్గారావును బొబ్బిలి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు సోమవారం వేర్వేరుగా కలిశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో వారిని కలిసిన న్యాయవాదుల బృందం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణానికి మంజూరు చేసిన రూ.31.20 కోట్లను త్వరగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రస్తుతం అద్దె భవనంలో కోర్టు విధులు జరుగుతున్న కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులను వివరించింది. మంత్రిని, న్యాయమూర్తిని కలిసిన వారిలో న్యాయవాదులు గంటి శర్మ, తమ్మిరెడ్డి దామోదరరావు, ఎన్.జగదీశ్వరరావు, కె. ప్రసాదరావు, ఎ.రామకృష్ణ, ఎం.జగన్నాథరావు, జె.శ్రీనివాసరావు, డి.అప్పలరాజు ఉన్నారు.

గణనాథుడికి 108 రకాల నైవేద్యం



స్వామికి సమర్పించిన ప్రసాదాలు

రాజాం: పట్టణంలోని మారుతీనగర్ 3వ లైన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో స్థానిక భక్తులు 108 రకాల నైవేద్యాన్ని స్వామివారికి సోమవారం నివేదించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సొసైటీ అభివృద్ధి

- పీఏసీఎస్ ఛైర్మన్ తాడ్డి రామచంద్రరావు



మాట్లాడుతున్న పీఏసీఎస్ ఛైర్మన్ రామచంద్రరావు

మెంటాడ: సమష్టి కృషితోనే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) అభివృద్ధి సాధ్యమని పీఏసీఎస్ ఛైర్మన్ తాడ్డి రామచంద్రరావు అన్నారు. సోమవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.1.33 కోట్ల మార్ట్‌గేజ్ రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇచ్చిన రుణాలను రెన్యువల్ రూపంలో రూ.60 లక్షలకు పైగా వసూలు చేయడం జరిగిందన్నారు. బ్యాంకు ఆవరణలోని షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.15 లక్షల నాబార్డు నిధులు మంజూరయ్యాయన్నారు. నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని, అయితే రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తయ్యేవరకు స్థల సేకరణ పూర్తిస్థాయిలో చేయలేమన్నారు. బ్యాంకు పరిధిలోనే ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని, రైతులకు అందుబాటులో సిబ్బంది ఉండేలా చూడాలని సభ్యులు ఛైర్మన్‌ను కోరారు. సమావేశంలో సీఈవో వెంపడాపు ప్రసాద్, త్రీమెన్ కమిటీ సభ్యులు అల్లు తిరుపతిరావు, వెంకట చిట్టిరాజు, సర్పంచ్ రేగిడి రాంబాబు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



అమరాంలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ సిద్ధేశ్వరి



రాజాం సిటీ: సర్వేపై అవగాహన నిర్వహిస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పక్కాగా ఉండాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్ధేశ్వరి అన్నారు. మండలంలోని ఆగూరు పంచాయతీ అమరాం గ్రామంలో సోమవారం చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో..

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, సంకిలి, బూరాడ, చిన్నశిర్లాం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడుతో పాటు వైద్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు.

సహకరించాలి

రాజాం సిటీ: గ్రామాల్లో చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు వలంటీర్లు, వైద్య సిబ్బంది అంతా సహకరించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండల పరిధి పాగిరి గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బందికి సర్వేపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే సక్రమంగా చేపట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సర్వే..

సంతకవిటి: మండల పరిధిలోని జావాం, వాసుదేవపట్నం, గొల్లవలస, బూరాడపేట, చిత్తారపురం, తదితర గ్రామాలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, హెమోగ్లోబిన్ పరీక్షలు చేపట్టారు.

మండలాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలి

తెర్లాం: మండలంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి అధికారుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఒక్కో శాఖకు సంబంధించిన ప్రగతి, జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారంపై సమీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మండల ఇంజనీరింగ్ అధికారి రాజశేఖరరావుకు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ ఒక్కరికీ వైద్య సేవలు అందేలా తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల డాక్టర్లు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో జరిగే నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. జగనన్న ఇళ్ల లేఅవుట్లలోను, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, సామూహిక గృహ ప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని హౌసింగ్ ఏఈ ఆనందకుమార్‌కు తెలియజేశారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

బాడంగి: అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హౌసింగ్ ఏఈ ఎన్.సత్యం అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు లోగా ఇళ్లు కావాలనుకునే వారి దరఖాస్తులు, పేర్లను తమ కార్యాలయానికి అందజేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నవదుర్గ ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు రేపు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఈఓ పి. శ్యామలరావు, ఆలయ ధర్మకర్త వి.నర్సింగరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్, భక్తుల సమక్షంలో హుండీలు తెరవనున్నామని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా...

అన్నదానం

రేగిడి: మండలంలోని అంబఖండిలో గణపతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అంబఖండితో పాటు పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అలాగే లక్ష్మీపురం, అక్కన్న అగ్రహారం, తదితర గ్రామాల్లో కూడా అన్నదానాలు నిర్వహించారు.

విజేతలకు బహుమతులు

రాజాం: పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మంటపం వద్ద విద్యార్థులు, మహిళలకు సోమవారం పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు చేతులమీదుగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ టీపీఓగా ప్రమీలారాణి

రాజాం: రాజాం పట్టణ ఇన్‌చార్జ్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా ప్రమీలరాణి బాధ్యతలు స్వీకరించారని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ఇక్కడ టీపీఓగా పనిచేసిన నాగలతకు ఉద్యోగోన్నతిపై విశాఖపట్నం బదిలీ జరిగిందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

సంతకవిటి: మండల పరిధిలోని గోళ్లవలసలో ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో సామూహిక కుంకుమ పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా.. కమిటీ సభ్యులు భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న దీపారాధన



వివిధ ఆకృతుల్లో దీపాలు

రేగిడి: మండలంలో వన్నలి గ్రామంలో గణనాథుని మంటపం వద్ద సోమవారం దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. అనంతరం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీ

సంతకవిటి: స్థానిక ఎంఆర్‌సీ కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు సోమవారం రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీ నిర్వహించారు. ఆరు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా.. మందరాడ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఎంఈఓ -2 భాస్కరరావు తెలిపారు. విజేతలు జిల్లా కేంద్రంలోని పీఎస్సార్ పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ఉత్సాహంగా రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు

తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ప్రధానోపాధ్యాయుడు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఎంఈవోలు జె.త్రినాథరావు, పాపారావు తనిఖీ చేశారు. మండలంలోని 7 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థుల్లో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున హాజరయ్యారు. 25 మార్కులకు నిర్వహించిన ఈ పోటీలో 16 మార్కులు సాధించి, తెర్లాం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేత జట్టు సభ్యులను ఎంఈవోలు, హెచ్ఎం, సిబ్బంది అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

రేగిడి: మండల తహసీల్దార్‌గా బి.సుదర్శనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన టి. కల్యాణచక్రవర్తి బదిలీపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లిపోగా, ఆయన స్థానంలో సుదర్శనరావు దత్తిరాజేరు మండలం నుంచి వచ్చారు.

బస్టాండ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్



మున్సిపల్ కమిషనర్‌కు వివరాలు వెల్లడిస్తున్న డీఈఈ శ్రీనివాసరావు

రాజాం: పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి మున్సిపల్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్ పక్కనే ప్రభుత్వ స్థలంలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులతో భూమి పూజ చేయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు ప్రారంభానికి మున్సిపల్ కార్యాలయానికి ప్లాన్ అప్రూవల్ నిమిత్తం దరఖాస్తు చేసినట్లు ఆర్టీసీ డీఈఈ టీవీ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ శాఖ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావును కలిసి మాట్లాడారు. రూ. 1.48 కోట్లతో 1.42 ఎకరాల స్థలంలో బస్టాండ్ నిర్మాణానికి ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో టీపీఓ ప్రమీలారాణి, ఆర్టీసీ సూపర్‌వైజర్ కంబాల అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్థిక లావాదేవీల పరిశీలన



బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుంటున్న టీఎంసీ ఎస్‌వీ రత్నం

రాజాం సిటీ: ఈ నెల 26 నుంచి మున్సిపాలిటీ పరిధిలోని డ్వాక్రా గ్రూపుల ఆర్థిక లావాదేవీలను పరిశీలించనున్నామని మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం తెలిపారు. ఇటీవల పొనుగుటివలసకు చెందిన ఆర్పీలు డ్వాక్రా మహిళలకు తెలియకుండా నగదు సొంతానికి వాడుకున్న నేపథ్యంలో పీడీ ఆదేశాలు మేరకు ఈ తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆమె బ్యాంక్‌ను సంప్రదించి గ్రూపులకు సంబంధించిన స్టేట్‌మెంట్లను తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే సిద్ధి వినాయక గ్రూపు నుంచి ఆర్పీ ఉమాదేవి రూ. 10 లక్షలు తన సొంతానికి వాడుకోవడంతో గ్రామంలో మహిళలు ఆందోళనలు చేస్తున్నారన్నారు. ఆ గ్రూపు నుంచే కాకుండా ఇతర గ్రూపుల నుంచి కూడా మరో ఆర్పీ సంధ్య అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. మొత్తం గ్రామంలోని 90 గ్రూపుల రికార్డులు పరిశీలించి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ముందుగా పాదుపులక్ష్మి, విశ్వబ్రాహ్మణ, రామలింగేశ్వర, సీతారామ, కనకదుర్గ ఎస్‌హెచ్‌జీల గ్రూపు లీడర్లు, సభ్యులు సంబంధిత పుస్తకాలతో మధ్యాహ్నం 2 గంటలకు శివాలయం వద్దకు హాజరుకావాలని సూచించారు.

జిల్లేడు ద్రావణంతో కుళ్లు తెగులుకు చెక్



రాజాం: జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

రాజాం: రైతులు తాము సాగుచేస్తున్న వరి పంటలో జిల్లేడు ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల కుళ్లు తెగులును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పి.భారతి, నిర్మల తెలిపారు. పాగిరి గ్రామంలో జిల్లేడు ద్రావణం తయారీ, వినియోగంపై సోమవారం అవగాహన కల్పించారు. వంద లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని రైతుల సమక్షంలో తయారీచేసి, పంటకు వేసే విధానాన్ని వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన..

రేగిడి: వరి పంటకు ఆశించే తెగుళ్ల నివారణకు కషాయం ఎంతో బాగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది గౌరీశ్వరరావు, ఐసీఆర్పీ కరణం వరలక్ష్మి, పుర్లి లక్ష్మున్నాయుడు అన్నారు. మండలంలోని అంబఖండిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జిల్లేడు ద్రావణాన్ని తయారీ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యురాలు పుర్లి సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు

రాజాం సిటీ: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ, కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అందించాలని.. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్త సమ్మె తప్పదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్, దాసు, హరికృష్ణ, గురువులు, లక్ష్మి, ప్రసన్న, గిరి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడడమే ధ్యేయం

- సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోక్‌నాథం

రామభద్రపురం: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడడమే తమ ధ్యేయమని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోక్‌నాథం అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రవేటీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ నేత బలస ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీ మండల కేంద్రంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా పేరొందిన విశాఖ ఉక్కు పరిశ్రమను నమ్ముకుని, ఎంతోమంది జీవిస్తున్నారని, అటువంటి పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్రం విఫలమైందన్నారు. 29న కూర్మన్నపాలెం స్టీల్ దీక్షా శిబిరం వద్ద జరిగే బహిరంగసభకు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల కార్యదర్శి కూర్మినాయుడు, విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణ్‌నాయుడు పాల్గొన్నారు.